'ఓపీఎస్ పునరుద్ధరించాల్సిందే..'

పాలకొండ: పాత పింఛను విధానాన్ని సర్కారు పునరుద్ధరించాలని ఏపీ సీపీఎస్ఈఏ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా వచ్చేనెల 4న విశాఖలో నిర్వహించనున్న సాగర సంగ్రామ దీక్షకు ప్రతిఒక్కరూ తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. శనివారం పాలకొండలో దీక్ష సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని వారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పారని విమర్శించారు. ఇందుకు నిరసనగా విశాఖలో చేపట్టే దీక్షకు సీపీఎస్ సభ్యులు హాజరై.. విజయవంతం చేయాలని కోరారు.

పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచే బస్సు ఎక్కుతూ పార్టీ సమావేశానికి వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు



పాలకొండ బస్టాండ్ వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు



అటు బస్సులు.. ఇటు అవస్థలు

- సీఎం సభకు జిల్లా నుంచి135 ఆర్టీసీ బస్సులు కేటాయింపు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- కాంప్లెక్స్‌ల్లో గంటలకొద్దీ నిరీక్షణ
- వైసీపీ సర్కారు వైఖరిపై పెదవి విరుపు

(పార్వతీపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్/ సాలూరు/ పాలకొండ)

విశాఖ జిల్లా భీమిలిలో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్ బహిరంగ సభకు 'మన్యం' నుంచి అధికంగా బస్సులు కేటాయించారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఆర్టీసీ డిపోల నుంచి 135 బస్సులను మళ్లించారు. వాటి ద్వారా జిల్లా నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు, జనాలను భీమిలి సభకు తరలించారు. దీంతో జిల్లాలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లా పాపలతో ఆర్టీసీ కాంపెక్స్‌లు, బస్టాండ్‌ల వద్ద పడిగాపులు కాశారు. బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించారు. గమ్య స్థానాలు చేరుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. వచ్చిన కొద్ది బస్సులను ఎగబడి ఎక్కారు. ఇదే సమయంలో వృద్ధులు, మహిళలకు ఇక్కట్లు తప్పలేదు. ఫుట్‌పాత్‌లపై నిల్చొని ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు టెన్షన్ పడ్డారు. సకాలంలో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లగలమా? లేదా! అని ఆందోళన చెందారు. మరోవైపు జిల్లా నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారు సైతం నానా అవస్థలు పడ్డారు. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. అధిక చార్జీలు వసూలు చేసినా.. తప్పనిసరి పరిస్థితుల్లో వాటిల్లో ప్రయాణాలు సాగించారు. అయితే సీఎం జగన్ సమావేశానికి బస్సులను తరలించారని తెలిసి వారంతా పెదవి విరిచారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వైసీపీ సభకు బస్సులను మళ్లించడంపై ప్రయాణికులు మండిపడ్డారు. అసలే బస్సుల కొరత ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ ఇటువంటి చర్యలు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. ఇటీవల తెలుగుదేశం దేశం విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించిన యువగళం పాదయాత్ర ముగింపు సమావేశానికి అద్దె ప్రాతిపదికన కూడా బస్సులు ఇవ్వని ఆర్టీసీ.. ఇప్పుడు వైసీపీ సభకు ఎలా బస్సులు కేటాయించిందని పలువురు ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలను తరలించడం ఏమిటని జిల్లావాసులు ధ్వజమెత్తారు. మొత్తంగా అటు ప్రభుత్వం, ఇటు ఆర్టీసీ తీరుపై ప్రజలు విమర్శలు గుప్పించారు. సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంగా సీఎం సభ అంటే చాలు.. జిల్లావాసులు హడలెత్తిపోతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీ ఎక్కడ సభ నిర్వహించినా.. మన్యం జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులను కేటాయిస్తుండడంతో ప్రయాణికులకు ఆపసోపాలు తప్పడం లేదు. తాజాగా జిల్లాలో మూడు ఆర్టీసీ డిపోల నుంచి ఎన్నెన్ని బస్సులు మళ్లించారో ఇప్పుడు తెలుసుకుందాం.



పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సులు లేక సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఇలా..

పార్వతీపురం నుంచి 55 బస్సులు..

భీమిలిలో జరిగే వైసీపీ సమావేశానికి పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి 55 బస్సులు కేటాయించారు. దీంతో పార్వతీపురం నుంచి విజయనగరం, విశాఖపట్నం, పాలకొండ, సాలూరు, బొబ్బిలి ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బస్సుల కోసం గంటలకొద్దీ కాంప్లెక్స్‌లో నిరీక్షించారు. మరోవైపు ఆర్టీసీ అధికారులు డిపో నుంచే వైసీపీ కార్యకర్తలు, నాయకులకు బస్సుల్లో ఎక్కించి భీమిలి పంపించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

సాలూరు నుంచి 35..

భీమిలిలో వైసీపీ సభకు సాలూరు ఆర్టీసీ డీపో నుంచి 35 బస్సులను కేటాయించినట్లు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. అయితే డిపోలో సగం బస్సులను ముఖ్యమంత్రి సభకు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం గంటలకొద్దీ పడిగాపులు కాశారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

పాలకొండలో ప్రయాణికులు ఇలా..



పాలకొండ నుంచి 45..

పాలకొండ డిపోలో 69 బస్సులు ఉండగా, సీఎం బహిరంగ సభకు 45 బస్సు లను కేటాయించారు. దీంతో పాలకొండ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు అష్టకష్టాలు పడ్డారు. వాస్తవంగా డివిజన్ కేంద్రం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. అయితే ముఖ్యమంత్రి సభకు అధికంగా బస్సులను కేటాయించడంతో ప్రయాణికులు, విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. వారంతా గంటల కొద్దీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనే ఉండిపోయారు. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకున్నారు. మరోవైపు సీతంపేట ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు చెందిన వారు సైతం శనివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మా బాధలు పట్టించుకోరా..

భీమిలిలో వైసీపీ సమావేశం కోసం పార్వతీపురం డిపో నుంచి అధికంగా ఆర్టీసీ బస్సులను కేటాయించడం తగదు. బస్సుల కోసం పార్వతీపురం కాంప్లెక్స్‌లో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. మా బాధలను పట్టించుకునే వారే కరువయ్యారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే మా లాంటి ప్రయాణికులకు బస్సులు లేకపోతే.. ఎన్ని కష్టాలు పడాలో అధికారులు, ప్రభుత్వానికి తెలియడం లేదు.

-సాయికుమార్, ప్రయాణికుడు, పార్వతీపురం

అలా.. ఎలా కేటాయిస్తారు?

ప్రయాణికుల ఇబ్బందులు, కష్టాలను చూడకుండా వైసీపీ సభకు బస్సులను ఎలా కేటాయిస్తారు? మా లాంటి పేదలు ప్రైవేట్ వాహనాల్లో ఎలా ప్రయాణించగలం. ఈ విషయం ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులకు తెలియదా?. ప్రజలు, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

-పోలేరమ్మ, ప్రయాణికురాలు, పార్వతీపురం

గంటల కొద్దీ నిరీక్షణ..

మా సొంత ఊరు గుమ్మలక్ష్మీపురం. సంక్రాంతి పండగ నేపథ్యంలో మా అత్తవారి ఊరైన సాలూరు మండలం బాగువలస వచ్చాం. మళ్లీ సొంతూరు వెళ్దామని సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తే బస్సులేవీ లేవు. గంటల కొద్దీ కాంప్లెక్స్‌లోనే నిరీక్షించాల్సి వచ్చింది. అసలు మా ఊరుకు సాలూరు నుంచి డైరెక్ట్ బస్సు లేదు. పార్వతీపురం వెళ్లి.. అక్కడ నుంచి ఇంకో బస్సును పట్టుకోవాలి. అయితే మా గ్రామానికి బస్సు ఉందో.. లేదో... అసలు వేశారో లేదు కూడా తెలియడం లేదు.

-ఆరిక సింహాచలం, ప్రయాణికుడు, గుమ్మలక్ష్మీపురం

ఇబ్బందులు పడ్డాం..

సకాలంలో బస్సులు లేక గమన్య స్థానాలకు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గంటల కొద్దీ బస్టాండ్లలో నిరీక్షించినా ఫలితం లేకపోయింది. ఏదేమైనా ఆర్టీసీ డిపోలో సగం బస్సులను సీఎం సభకు కేటాయించడం తగదు. ప్రయాణికుల పరిస్థితిని కూడా ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు గుర్తించాలి.

-కె.సుబ్బినాయుడు, ప్రయాణికుడు, వీరఘట్టం

సమస్యలు పరిష్కరించకుంటే రోడ్డెక్కుతాం

- పెన్షనర్ల సంఘం వెల్లడి
- ప్రభుత్వ తీరుపై మండిపాటు

బెలగాం, జనవరి 27: వైసీపీ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రోడ్డెక్కి నిరసన తెలుపుతామని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. శనివారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సంఘ నాయకులతో కలిసి విలేఖర్లతో మాట్లాడారు. ఇంతవరకు పెన్షనర్లు ఎప్పుడూ రోడ్డెక్కి ధర్నాలు చేసిన పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం వైసీపీ సర్కారు చర్యల వల్ల మూడు దశల్లో నిరసన కార్యక్రమాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా ఇటీవల మండల కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టామన్నారు. ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టి, అధికారులకు వినతిపత్రం ఇస్తామని స్పష్టం చేశారు. వచ్చేనెల 4న 'చలో విజయవాడ' కార్యక్రమం చేపడతామని తెలిపారు. పెద్దఎత్తున పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సర్కారు స్పందించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం జీవో ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే డీఆర్ బకాయిలను విడుదల చేయాలని, 10వ పీఆర్సీలో తగ్గించిన అడి షినల్ క్వాంటమ్‌ను తిరిగి యథావిధిగా పునరుద్ధరించాలని, ఎరియర్స్ వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల ద్వారా అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు లక్ష్మణరావు, తవిటి నాయుడు, తవిటిరాజు, సన్యాసినాయుడు, కె.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతిరావు

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

మక్కువ, జనవరి 27: జిల్లాలో మాతాశిశు మరణాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో ఆయా మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది చూడాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం బాగుజోల గ్రామంలో పర్యటించారు. పదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి.. గ్రామస్థులతో మాట్లాడారు. మాతా,శిశు మరణాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భం దాల్చిన వెంటనే ఆసుపత్రుల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహార కిట్లును గర్భిణులు, బాలింతలు, చిన్నారులు మాత్రమే తీసుకోవాలన్నారు. తద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా ఇందుకు సహకరించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు సచివాలయం స్థాయిలో అంగన్‌వాడీ, ఏఎన్ఎం, మహిళా పోలీసు బృందంగా నియమించామని చెప్పారు. ఎంపీడీవో పర్యవేక్షణలో ప్రతి మండలంలో వారు రక్తహీనత కలవారిని గుర్తించి క్రమం తప్పకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తారని, పౌష్టికాహారం తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి వినోద్, పీహెచ్‌సీ వైద్యుడు రఘు, తహసీల్దార్ సూర్యనారాయణ, ఆశాలు ఉన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి: పీవో

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శనివారం హడ్డుబంగి, ఉప్పరజమ్మి శంభాంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రాల్లో మరుగుదొడ్లు లేకుంటే వెంటనే నిర్మించాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులను వేగవంతంగా పూర్తిచేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడరాదని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నరసింహులు, ఆర్ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.



శంభాం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి సౌజన్య

పెద్దలపై నిర్లక్ష్యం తగదు

- అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి సౌజన్య

పార్వతీపురం రూరల్, జనవరి 27 : వృద్ధులైన తల్లిదండ్రులను ప్రతిఒక్కరూ జాగ్రత్తగా చూసుకోవాలని, వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి డి.సౌజన్య తెలిపారు. ఐఆర్‌పీడబ్ల్యూ ఆధ్వర్యంలో శనివారం నర్సిపురం గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, కుటుంబ పెద్ద నాయకత్వం వహించేవారని తెలిపారు. పెద్దలపై ఎలా నడుచుకోవాలని తెలిసేదని అన్నారు. నేడు ఆ పరిస్థితి లేదని, ఉమ్మడి కుటుంబాలు పూర్తిగా కనుమరుగయ్యాయని తెలిపారు. నేటి సమాజంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంతో వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే వారే కరువయ్యారని చెప్పారు. కనీసం రోజుకు ఒకసారైనా పెద్దలను పిల్లలు పలకరించాలని సూచించారు. ఎవరైనా పెద్దలను పట్టించుకోకపోతే ట్రిబ్యూనల్‌లో మెయింటెనెన్స్ కేసు వేయొచ్చని తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ అడ్వకేట్ జోగారావు, న్యాయ వాదులు వెంకట్రావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవే పొరపాట్లు

- ఓటర్ల జాబితాలో అనేక తప్పులు
- చనిపోయిన వారి పేర్లు ప్రత్యక్షం
- ఉన్న వారి ఓట్లు మాయం



విజయనగరం కలెక్టరేట్/ బొబ్బిలి, జనవరి 27: ఓటరు జాబితాలో అనేక లోపాలు ప్రస్పుటమవుతున్నాయి. ఎన్నెన్నో సభలు.. సమీక్షలు.. సవరణలు.. పరిశీలనలు చేసినా ఇంకా గందరగోళం వీడలేదు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు కావాలని ఎన్నికల కమిషన్ చెబుతుండగా తాజాగా తయారైన జాబితాలో అనేక లోపాలు కన్పిస్తున్నాయి. గత ఏడాది అక్టోబరు 27 విడుదల చేసిన డ్రాఫ్ట్ రోల్‌లో అనేక అభ్యంతరాలు ఉండటంతో వాటిని సవరించాలని స్థానిక ప్రజా ప్రతి నిధులు దరఖాస్తు చేశారు. అయినా తుది జాబితాలో పొరపాట్లు కన్పిస్తున్నాయి.


బతికి లేకున్నా ఓటుంది

అక్కడ చనిపోయిన వారికీ ఓటు భద్రంగా ఉంచారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తుండగా బొబ్బిలిలో చిత్ర విచిత్రాలు బయటపడుతున్నాయి. పట్టణంలోని ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి పేర్లు యథాతథంగా కనిపిస్తుండడంతో ఆశ్చర్యపోవడం వారి వంతువుతోంది. ఐదో వార్డులో పోలింగ్ స్టేషన్ 60లో ఉన్న విష్ణుమూర్తి, కాడ వెంకటరమణ, గునుపూరు రామలక్ష్మి, బురిడి రమణమ్మలు మృతిచెందగా ఆ పేర్లను తొలగించకుండా వారికి ఓటు హక్కును యథాతథంగా కొనసాగిస్తున్నారు. ఇదే వార్డులో 60వ నెంబరు పీఎస్‌లోనే సీరియల్ నెంబరు 297లో పల్ల చిన్నమ్మ అనే ఓటరు ఫొటో బదులుగా మరొకరి ఫొటో ముద్రితమైంది. 136వ సీరియల్ నెంబరులోనూ.. 62వ సీరియల్ నెంబరులోనూ గొర్లె శంకరరావు పేరు రెండుసార్లు నమోదైంది. అలాగే ఏ వార్డుకు చెందిన వారి పేర్లు అదే వార్డులో కాకుండా వేరే వార్డుల్లోనూ దర్శనమిస్తున్నాయి. వాటిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

జాబితా నుంచి తొలగింపులు

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలోని నివసిస్తున్న పొటుపురెడ్డి రమణ ఓటు తుది జాబితాలో తొలగించారు. ఇదే గ్రామానికి చెందిన పొటుపురెడ్డి ఎర్రినాయుడు ఓటును కూడా తొలగించారు. కాగా కోర్లాం గ్రామానికి చెందిన మాడెం అప్పలస్వామి మృతి చెంది మూడు నెలలు కావస్తున్నా ఓటర్ల జాబితాలో ఆయన పేరు ఉంది. ఇదే గ్రామంలో ఓటర్ల జాబితాలో ఇంటి నెంబర్లు తప్పుగా పడ్డాయి. ఓటర్ల ఫొటోలు అడ్డదిడ్డంగా కన్పించాయి.

ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు


1121 LWC2166387
ఓటరు పేరు : రామలక్ష్మి గునుపూరు
భర్త పేరు: అసిమినాయుడు గురాని
ఇంటి సంఖ్య : 30-53
వయస్సు : 38 లింగము : స్త్రీ
Deth


408 YKS1659234
ఓటరు పేరు : విష్ణుమూర్తి పున్నా పున్నా
తండ్రి పేరు: గంగారావు పున్నా
ఇంటి సంఖ్య : 26-53/1
వయస్సు : 87 లింగము : పు
Deth

1142 LWC117159
ఓటరు పేరు : రమణమ్మ బురిడి
భర్త పేరు: శంకరరావు
ఇంటి సంఖ్య : 9-80/1
వయస్సు : 43 లింగము : స్త్రీ
Deth
YKS0771940

ఎంపీడీవోలకు స్థానచలనం

- ఉమ్మడి జిల్లాలో 21 మంది బదిలీ



గరుగుబిల్లి, జనవరి 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల స్థాయి అధికారుల బదిలీలు ప్రారంభమయ్యాయి. విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు సంబంధించి మొత్తంగా 21 మంది ఎంపీడీ వోలను శ్రీకాకుళం, విశాఖలకు బదిలీ చేస్తూ రాష్ట్ర పంచా యతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. సొంత జిల్లాలో సం బంధిత ఎంపీడీవోలు విధులు నిర్వహించకుండా చర్యలు చేపట్టారు. మూడేళ్లు పైబడిన వారికి ఎన్నికల నిబంధనల మేరకు స్థానచలనం కల్పించారు. అయితే రెవెన్యూ శాఖకు సంబంధించి తహసీల్దార్ల బదిలీలకు ఇంకా ఆదేశాలు రావాల్సి ఉంది. రెండు జిల్లాల పరి ధిలో ఎంపీడీవోలుగా విధులు నిర్వహిస్తున్న ఎం.రత్నం, డీడీ స్వరూపరాణి, బి.కల్యాణి, వై.పద్మజ, జి.గిరిబాల, కె.సాల్మన్‌రాజు, సీహెచ్ సూర్యనారాయణ, వైవీ రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణంరాజు, ఎంవీబీ సుబ్రహ్మణ్యం, కె.కిషోర్‌కుమార్, జి.భాస్క రరావు, ఎం.సతీష్, పి.త్రివిక్రమరావు, ఎస్.రామకృష్ణ, కె.విజ యలక్ష్మి, జి.పైడితల్లిలను శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. అదేవిధంగా ఎస్.అప్పల నాయుడు, కె.రామమణి, కె.శేషుబాబు, బీఎస్‌కేఎన్ పట్నాయక్‌లను విశాఖ జిల్లాకు బదిలీ చేశారు. సంబంధిత ఎంపీడీవోలు ముందుగా ఆయా జడ్పీ సీఈవోలకు సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏదేమైనా ఈ నెల 31 లోగా వారంతా బదిలీ అయిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఇదిలా ఉండగా బదిలీ ఆదేశాలతో పలువురు ఎంపీడీవోలు అధికార పార్టీకి చెందిన ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. అనుకూలమైన ప్రాంతాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు

విజయనగరం దాసన్నపేట: సేవా కార్యక్రమాలే గుర్తింపును ఇస్తాయని చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర అన్నారు. బొబ్బిలి పట్టణంలో హిందీ పండిట్ గేదెల అప్పలనాయుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు తోట వాసు, జాకీరు హుస్సేన్, జగదీష్, శివ, అభిరామ్, అప్పారావు, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు. పార్వతీపురం-మన్యం జిల్లా బూర్జ గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు సూరుమల్లి అశోక్ కుమార్ తండ్రి సూరమల్ల సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించారు.

కుల గణన సర్వే వేగవంతం

రాజాం రూరల్: కులగణన సర్వేతో పాటు ఎలక్ట్రికల్ మీటర్ సర్వేలను వేగవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాసూరు శంకరరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగం, ఇంటిపన్నుల వసూళ్లు, క్లాప్‌మిత్ర పెండింగ్ జీతాల వివరాలు, 2022-23 ఆదాయం, ఖర్చుల వివరాలపై కార్యదర్శులతో చర్చించారు.

దోసరి రహదారికి మరమ్మతులు చేయండి

రాజాం రూరల్: కొత్త కంచరాం నుంచి దోసరి, రామినాయుడువలస గ్రామాల ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఐ కార్యదర్శి శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయిదేళ్లుగా రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. బైక్‌లు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు.

రాజాంలో టీడీపీ సమావేశం

రాజాం: రాజాం నియోజకవర్గ పరిధిలోని రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల ముఖ్య నాయకులంతా కిమిడి కళావెంకటరావు క్యాంపు కార్యాలయంలో శనివారం రాష్ట్ర పరిశీలకుడు దామచర్ల రాజా వద్ద సమావేశమయ్యారు. టీడీపీ అభ్యర్థి విషయమై కొళ్ల అప్పలనాయుడు, పైల వెంకటరమణ, బెజ్జిపురపు త్రినాథరావు, ఉదయాన మురళీకృష్ణ తదితరులు మాట్లాడారు. నాలుగు మండలాల నాయకులం కలిసి కట్టుగా పనిచేస్తామని, అభ్యర్థిని గెలిపిస్తామని వివరించారు. ఈ విషయాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామని రాజా అన్నారు. రాజాం అర్బన్, రాజాం రూరల్, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ముందుగా వీరంతా కిమిడి కళావెంకటరావుతో ఈ విషయమై చర్చలు జరిపారు.

ట్యాబ్‌ల పంపిణీ

లక్కవరపుకోట: మండలంలో గల మహాత్మా జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ జి.రామ్మూర్తి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ యామీకే పాత్రో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు

లక్కవరపుకోట: ఎల్‌కోటలోని పశువైద్య కేంద్రంలో డాక్టర్ కే.గాయత్రి ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు పంపిణీ చేశారు. మండలంలో గల పెంపుడు జంతువులన్నింటికీ అన్ని కేంద్రాల్లోనూ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, జంతువుల పెంపకందారులు అందరూ ఈ టీకా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ గాయత్రి కోరారు. శనివారం 30 మంది తమ జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకున్నట్టు తెలిపారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

విజయనగరం క్రైం: వాహనదారులు ట్రాఫిక్, మోటారు వాహన చట్ట నిబంధనల ఉల్లంఘనలో నమోదైన అపరాధ రుసుం చలానాలను తక్షణమే చెల్లించాలని ట్రాఫిక్ ఎస్ఐ లోవరాజు కోరారు. ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కోట జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల నుంచి చలానాలు వసూలు చేశారు. ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

3న ఢిల్లీలో ధర్నా

బొబ్బిలి: జాతీయ విద్యా విధానం-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 3న ఢిల్లీలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అఖిల భారత విద్యాహక్కుల వేదిక (ఏఐఎఫ్ఆర్‌టీఈ) ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానంతో పాటు నూతన జాతీయ కరిక్యులం ఫ్రేమ్ వర్క్ (ఎన్‌సీఎఫ్)ను కూడా రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలో జరగనున్న ధర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఏకాదశ రుద్రాభిషేకం

బొబ్బిలి: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్యూనిటీ భవనంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. డాక్టర్ కొఠారు సాయి శ్రీహరి ప్రసాద్ శర్మ, సునీల్ కుమార్ రథో ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని సంస్థ ప్రతినిధి తమ్మిరెడ్డి వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాకులమాత జాతరపై చర్చ

కొత్తవలస: వ్యాకులమాత జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై కొత్తవలస సీఐ వి.చంద్రశేఖర్ శనివారం నిర్వాహకులతో చర్చించారు. వ్యాకులమాత పుణ్యక్షేత్ర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 4న పెద్ద ఎత్తున జాతర జరగనుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. జాతరకు సుమారు 2 లక్షల మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగినట్టుగా రవాణా, వసతి సౌకర్యాల కల్పన, ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలనే విషయాలపై చర్చించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: వివిధ పాఠశాలల్లో చదువుతున్న వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖాధికారి బాలసూర్యారావు తెలిపారు. శనివారం ఆయన వీలుపర్తి, వెళ్లాం గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థుల వర్కుబుక్స్, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా కిలపర్తి

వేపాడ: జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావును నియమించినట్లు వేపాడ ప్రభుత్వ కళాశాల ప్రకటించింది. జిల్లా డీఈసీ కం హైపవర్ మెంబరుగా అప్పారావు బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి

● విజయనగరం ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జనవరి 27: టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 18, 19 డివిజన్ల పరిధిలో పర్యటించారు. చిరు వ్యాపారితో మాట్లాడారు. ఆమెతో కలిసి టిఫిన్ వండారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నాలుగున్నరేళ్ల ఈ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కష్టాలే మిగిలాయని, నిరుపేద, పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుకతుందన్నారు. విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18, 19 డివిజన్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ నగర, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సమస్యలు వర్ణనాతీతం


చిరు వ్యాపారితో మాట్లాడుతూ అట్లు వేస్తున్న అదితి గజపతిరాజు

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని.. వీరిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు శనివారం పార్టీ కార్యాలయం(అశోక్ బంగ్లా)లో అదితి గజపతిరాజుని కలిసి తమ సమస్యలను వివరించారు. వీటిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల కోసం ప్రత్యేక పథకాన్ని తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు చిన్నారావు, సురేష్ కుమార్, గొండేల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా వాహనాలు నడపాలి


అవగాహన ర్యాలీలో పాల్గొన్న రవాణాశాఖ అధికారులు

విజయనగరం క్రైం: వాహనాలను వేగంగా నడపటం ప్రమాదకరమని ఆర్టీవో ఎం.రమేష్ అన్నారు. రహదారుల భద్రత వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కళాశాల విద్యార్థులతో రోడ్డు ప్రమా దాలపై ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని ఆర్టీఏ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, తప్పనిసరిగా సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. సీనియర్ ఎంవీఐ రమణ మాట్లాడుతూ జరుగుతున్న ప్రమాదాల్లో అతివేగంగా వాహనాలు నడపటం, ప్రమాణాలు పాటించకపోవటంతో మృత్యువాత పడుతున్నారన్నారు. దీంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.వి.ఐలు ఐశ్వర్యలక్ష్మి, శ్రావ్య, రోడ్డు భద్రతా వైద్యాధికారి డాక్టర్ సాయికుమార్, ఐరాడ్ మేనేజర్ శ్రీధర్, గాయత్రి, శ్రీనివాస, కలాం కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిష్టియన్ మైనార్టీలకు సంక్షేమ పథకాలు టీడీపీతోనే


మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: క్రిష్టియన్ మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి క్రిష్టియన్ పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో పదకొండు రకాల వివిధ పథకాలను క్రిష్టియన్ కార్పొరేషన్ ద్వారా అందించామని గుర్తుచేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దగాపడ్డారన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, దుప్పలపూడి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల కుటుంబానికి పరామర్శ


కోళ్ల దంపతులను పరామర్శిస్తున్న భరత్, అదితి గజపతిరాజు

లక్కవరపుకోట, జనవరి 27: మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబాన్ని పలువురు రాజకీయ నేతలు శనివారం పరామర్శించారు. స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు భార్య పైడితల్లమ్మ శుక్రవారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ అధినేత ఎం.భరత్, విజయనగరం టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ రఘువర్మ, గజపతి నగరం టీడీపీ ఇన్‌చార్జి కేఏ నాయుడు, ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు చౌదరి నారాయణమూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కామేశ్వరరావులు కోళ్ల దంపతులను పరామర్శించారు. నేతలంతా మృతురాలు పైడితల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కే రమణమూర్తి, మల్లా రామకృష్ణ, కొట్యాడ రమణమూర్తి, బొబ్బిలి అప్పారావు, కొరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది ఓటు


కొత్త ఓటర్లతో సమావేశమైన గొంప కృష్ణ

శృంగవరపుకోట, జనవరి 27: ఓటు... రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో కొత్త ఓటర్లతో సమావేశమయ్యారు. నిజయితీగా పాలనను అందించే టీడీపీ అధికారంలోకి వచ్చేలా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నేరచరితులను, భూకబ్జాలకు పాల్పడే నేతలను ఇంటికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా టీడీపీదే విజయం

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైఎస్‌ఆర్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన తెలిపారు. ఆరికతోట గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార దర్పంతో వైసీపీ నాయకులు విర్రవీగుతున్నారని, వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. ఆర్థిక సంక్లిష్టంలో ఉన్న రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, కొత్త పరిశ్రమలు బాబు నాయకత్వంలో వస్తాయని తెలిపా రు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ సదస్సులో 'బాలభవన్' ప్రతిభ

రాజాం: గుజరాత్ రాష్ట్రం జున్నాగడాలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి బాలల సదస్సులో కాలుష్యం నివారణకు మంచి ప్లాస్టిక్ తయారీ విధానంపై స్థానిక బాలభవన్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుకు ఉత్తమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో 20 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. రాజాం బాల భవన్ విద్యార్థుల ప్రాజెక్టుకు మొదటి స్థానం దక్కింది. విద్యార్థులు ఎస్.కోమలి, సాయిబాలాజీ, ఇ.షణ్ముఖసాయి, ఎ.అనితలను జున్నాగడా గుజరాత్ డైరెక్టర్ నానాబాయ్, జాతీయ బాలభవన్ డైరెక్టర్ రుషిసింగ్‌లు అభినందించారు. వారికి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించారని బాల భవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని డబుల్ కాలనీలో హిందూ ధర్మరక్షా సమితి కార్యకర్త శంకరరావుపై విచక్షణా రహితంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సమితి రాష్ట్ర కార్యదర్శి ఎన్.వేణుగోపాలరావు కోరారు. గాయపడి కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకరావును పరామర్శించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం పోరాటం చేసే హిందూ సంస్థల సభ్యులకు సహకారం అందిస్తామన్నారు. హిందూ ధర్మం కోసం పోరాడే శంకరరావుపై దాడికి పాల్పడి గాయపరచడం బాధాకరమన్నారు. సమితి సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారని వేణుగోపాలరావు తెలిపారు.

ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ డే

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో శనివారం డ్రైవర్స్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ డేను నిర్వహించారు. విజయనగరం డీపీటీఓ సీహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ కె.రమేష్‌లు డ్రైవర్లకు కౌన్సిలింగ్ చేశారు. రహదారి భద్రతలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన వైసీపీ దురాలోచనకు నిదర్శనం

విజయనగరం దాసన్నపేట: బీసీ కులగణన చేపట్టడం వైసీపీ దురాలోచనకు నిదర్శనమని జనసేన నాయకులు గురాన అయ్యలు మండిపడ్డారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ కులాల గణన కేవలం ఎన్నికల ఎత్తుగడగా కనిపిస్తోందన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా కులగణన పేరిట సర్వే చేయడం సరికాదన్నారు. ప్రజలు ఎవరూ సహకరించవద్దని కోరారు.

పీవీ సేవలను గుర్తించని కేంద్రం


మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, జనవరి 27: కేంద్ర ప్రభుత్వం ప్రకటించే భారతరత్న, పద్మభూషణ్, పద్మ విభూషణ్, పద్మశ్రీ లాంటి అత్యున్నత పురస్కారాల్లో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, పీవీజీ రాజు లాంటి వారి సేవలను గుర్తించకపోవడం బాధాకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో పీవీ నరసింహారావు, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, సినీ నటుడు సోనూసూద్ లాంటి వ్యక్తులను గుర్తించకపోవడం దారుణమన్నారు. గోపాలరావు, తిరుపతినాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ జైలుకు వెళ్లినపుడే పరువు పోయింది

బొబ్బిలి: 'పీసీసీ అధ్యక్షురాలు, వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిలకు పరువు ఉందా?' అని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు ఎద్దేవా చేయడం హాస్యాస్పదంగా ఉందని పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అవినీతి ఆరోపణలు, కుంభకోణాల కేసులో 18 నెలల పాటు జగన్ జైల్లో ఉన్నప్పుడే వైఎస్ కుటుంబం పరువు పోయిందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన అనేకాంశాలపై షర్మిల సూటిగా ప్రశ్నిస్తుండడంతో వైసీపీ వారు తట్టుకోలేక ఎదురుదాడికి దిగుతున్నారని ధ్వజమెత్తారు.


ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ర్యాలీ

బొబ్బిలి, జనవరి 27: ఎలక్ట్రీషియన్ డే ని పురస్కరించుకొని బొబ్బిలి పట్టణంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ శనివారం ర్యాలీ నిర్వహించింది. ఆ సంఘం అధ్యక్షుడు జె.చం ద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం నిర్వహించారు. తొలుత యూనియన్ కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.

నేడు, రేపు అమ్మవార్ల తీర్థం

వేపాడ: వేపాడ గ్రామంలో ఆది, సోమవారాల్లో రెండు రోజులు గ్రామ దేవతలైన పరదేశమ్మ, ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, నిర్వహక కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు.

బొబ్బిలిలో భారీగా ట్రాఫిక్ జాం


బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ జాం


కొత్తవలస కాంప్లెక్సులో బస్సులు లేక..

బొబ్బిలి, జనవరి 27: వైసీపీ సభ పెడుతున్నారంటే ట్రాఫిక్‌కు తీవ్ర ఇక్కట్లు తప్పనిసరి. వాటితో పాటు విద్యాసంస్థలకు సెలవు షరా మామూలైపోయింది. భీమిలిలో శనివారం సీఎం సభను పురస్కరించుకుని ఆర్టీసీ బస్సులు, స్కూలు బస్సులను భారీగా వినియోగించడంతో నాన్‌లోకల్ విద్యార్థులకు మాత్రమే సెలవు ప్రకటించారు. లోకల్ విద్యార్థులందరికీ యథాతథంగా తరగతులు నిర్వహించారు. ఈ ఏడాది సెలవులు ఎక్కువ అయిపోయాయని, అందుకే స్కూల్స్‌కు సెలవు ఇవ్వకుండా, విద్యార్థులకు మాత్రమే సెలవు ఇచ్చినట్లు ఓ విద్యాసంస్థ నిర్వాహకుడు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావుకు విద్యాసంస్థలు ఉన్న సంగతి తెలిసిందే. ఆయన విద్యాసంస్థ శ్వేతాచలపతి ఇంగ్లీషు మీడియం స్కూలుకు చెందిన బస్సుల్లో కూడా వైసీపీ కార్యకర్తలు భీమిలి సభకు తరలి వెళ్తుండడంతో అందరూ గుసగుసలాడుకున్నారు. ● వైసీపీ కార్యకర్తలతో వెళుతున్న బస్సులు, ఇతర వాహనాలు ఒకేసారి బయలుదేరడంతో బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ట్రాఫిక్ జామ్ ఎక్కువైపోయింది. ఆర్టీసీ బస్సులు లేకపోవ డంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వచ్చింది.


బస్సులు లేక అవస్థలు

కొత్తవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి భీమిలి సమావేశానికి బస్సులన్నింటినీ తరలించడంతో కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సులో ప్రయాణికులు శనివారం అవస్థలు పడ్డారు. శృంగవరపుకోట డిపోనకు చెందిన 49 బస్సులలో 35 వరకు ముఖ్యమంత్రి సభకే పంపించారు. కొత్తవలసకు ఎక్కువగా విశాఖ పట్టణంలోని వివిధ డిపోల నుంచి సిటీ బస్సులు వస్తాయి. ఇవి సభకు తరలిపోయాయి. దీంతో కొత్తవలస కాంప్లెక్సులో బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొరగా బస్సులు వచ్చినా కిక్కిరిసిపోయి ఉండడంతో చిన్న పిల్లలతో ఉన్న ప్రయాణికులు ఎక్కలేక కాంప్లెక్సులోనే ఉండిపోవలసి వచ్చింది. పర్యాటక ప్రాంతమైన అరుకు వెళ్లేవారు మరింత ఇబ్బంది పడ్డారు.

గొల్లపల్లి ప్రభుత్వ స్థలంలో

రెవెన్యూ అధికారుల బోర్డు

● ఎట్టకేలకు విజయం సాధించిన గ్రామస్థులు


ప్రభుత్వ స్థలంలో బోర్డు పెట్టిన దృశ్యం

బొబ్బిలి, జనవరి 27: బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి పదో వార్డు పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు శనివారం బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రోద్బలంతో కొంతమందికి ఇళ్ల స్థల పట్టాలను మంజూరు చేశారు. దీనిపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలు దపాలు ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. శ్రీదాడితల్లి ఆలయం కోసం కల్యాణమండపం నిర్మించాలని గతంలో గ్రామపెద్దలంతా కలిసి తీర్మానించుకున్నారని, ఈ స్థలాన్ని అమ్మవారి దేవస్థానం అవసరాల కోసం మాత్రమే కేటాయించాలని 10, 12 వ వార్డులకు చెందిన పెద్దలు కాకల వెంకటరావు, పిరిడి ఈశ్వరరావు, చింతల లక్ష్మణరావు, పైల లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనిపై ఆర్డీవో ఎ.సాయి శ్రీ, తహసీల్దారు డోల రాజేశ్వరరావు స్పందించి గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆదేశాలు జారీ చేశారు. వీఆర్‌వో గొట్టాపు సింహాచలం, వీఆర్‌ఏ ఆదినారాయణ వెళ్లి ఆ స్థలం ప్రభుత్వానికి చెందుతుందని అక్కడ బోర్డును ఏర్పాటు చేశారు. దీనితో గ్రామస్థులు హ ర్షం వ్యక్తం చేశారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

లక్కవరపుకోట, జనవరి 27: అనుమానస్పద రీతిలో యువకుడు మృతి చెంది ఉన్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా ఆరిలోవకు చెందిన గొలగాని సతీష్(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆరిలోవ నుంచి క్రైస్తవ మత ప్రచారకులను తీసుకుని శనివారం ఉదయం మండలంలోని చందులూరు గ్రామానికి వచ్చాడు. వారంతా ప్రచారం చేసేందుకు గ్రామంలోకి వెళ్లగా, నీరసంగా ఉందని, కాసేపు రెస్టు తీసుకుంటానని, ప్రచారం ముగిసాక తనకు ఫోన్ చేయాలని చెప్పి సతీష్ వెళ్లిపోయినట్టు మత ప్రచారకులు వాపోయారు. ప్రచారం ముగించుకుని వచ్చి ఫోన్ చేయగా సతీష్ స్పందించకపోవడంతో చుట్టూ వెతకగా గ్రామంలోని ఒక గోతి వద్ద అనుమానాస్పద రీతిలో మృతి చెంది పడి ఉన్న సతీష్‌ను గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతుడి తల్లిదండ్రులైన నారాయణరావు, వెంకటలక్ష్మికి సమాచారం అందించగా వారు వచ్చి ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

5 ఇసుక ట్రాక్టర్లు సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

రామభద్రపురం: రొంపల్లి నదీ తీరం నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న 5 ఇసుక ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

రేగిడి: మండలంలో రెడ్డిపేట తోటల్లో శనివారం పోలీసులు పేకాటశిబిరంపై దాడి నిర్వహించి 14 మందిపై పిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 5360 నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందుతులను అరెస్టుచేసి స్టేషన్‌బైయిల్‌పై విడుదల చేశామన్నారు.

మద్యం రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: స్థానిక కోటిచెరువు సమీపంలో క్రీడా ప్రాంగణం వద్ద శనివారం సాయంత్రం స్కూటీలో మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. ఎం.బూర్జివలస గ్రామానికి చెందిన గొర్లె తిరుపతిరావు స్కూటీలో 21 మద్యం సీసాలను తరలిస్తుండగా పో లీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని స్కూటీని, మ ద్యం బాటిల్స్‌ను సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

● మండలంలోని అలజంగి పంచాయతీ వెలగవలస గ్రామంలో వెలగల భాస్కరరావు అనే వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. భాస్కరరావు మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో హెడ్ కానిస్టేబుల్ ఎస్.రాములు సిబ్బంది వెళ్లి శనివారం సాయంత్రం పట్టుకున్నారని, మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు


ఆక్రమిత ప్రాంతంలో స్తంభాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

బాడంగి, జనవరి 27: కోడూరు రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 110లో 6.57 ఎకరాలు, సర్వే నెంబరు 117 లో 7.57 ఎకరాల చెరువులు గతంలో ఆక్రమణకు గురవడంతో చుట్టూ కంచె వేశారు. దీనిపై సీపీఎం కార్యదర్శి సురేష్ ఇటీవల తహసీల్దార్ అజు రఫీజాన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందించి శనివారం సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సోమయ్య, వీఆర్వో రామకృష్ణలను ఆక్రమిత స్థలాలకు పంపించి... స్తంభాలను తొలగించారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ సీపీఎం సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం సిబ్బందిని పంపించి స్తంభాలను, కంచెను తొలగించామన్నారు. అసిస్టెంట్ సర్వేయర్లు వెంకటేష్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

కొండ డాబాలో నవీన ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొత్తవలస, జనవరి 27: కొత్తవలస కొండ డాబా వ్యాకులమాత ఉత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం నవీన ప్రార్థనలు జరిగాయి. ఇందులో భాగంగా దివ్యబలి పూజను విజయభాస్కర్ సమర్పించారు. విశాఖలోని సీతమ్మధార, సాలిగ్రామపురం, వెంకోజిపాలెంనకు చెందిన విచారణకర్తలు ప్రేమ్ కుమార్, రాజుగొంగాడ, జోజయ్య హాజరయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కలెక్టరేట్: వికసిత్ భారత్ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పని చేస్తుందని బీజేపీ నాయకులు ఇమంది సుధీర్ చెప్పారు. స్థానిక కంటోన్మెంట్ గణేష్ టెంపుల్ వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా అర్హులకు పక్కాగా ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలు మంజూరు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. గోడ పత్రికలు ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు రేఖ పైడిరాజు, గొలగాన రమేష్, అప్పారావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విధానాలతో విద్యారంగం వెనక్కి

రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై తీసుకుంటున్న నిర్ణయాల వల్ల విద్యారంగం తిరోగమనం దిశగా వెళ్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పర భానుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో ఉంగరాడమెట్ట వద్ద శనివారం సాయంత్రం ఏపీటీఎఫ్ మండలశాఖ సర్వసభ్య సమావేశం, కొత్తకార్యవర్గం ఎన్నిక ప్రక్రియలో ఏపీటీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ కొత్తకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వావిలపల్లి తారకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శెట్టి శివరావు, ఎన్నికయ్యారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సన్యాసిపాత్రుడు

కొత్తవలస: పీసీసీ పగ్గాలను వైఎస్ షర్మిల చేపట్టిన తరువాత కాంగ్రెస్ పార్టీలో మళ్లీ కదలిక వచ్చింది. ఇప్పటి వరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన కె.సన్యాసిపాత్రుడును మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.రమేష్ కుమార్ ఈ ఉత్తర్వులను పాత్రుడుకు అందజేశారు. పాత్రుడు మట్లాడుతూ మండలంలో పార్టీని మళ్లీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. షర్మిల రాకతో పార్టీలో ఊపు వచ్చిందని, విజయమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

వేపాడ గురుకుల పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద ఏపీ గురుకుల బాలికల పాఠశాలను విజయనగరం గురుకుల పాఠశాలల జిల్లా సమన్వకర్త టి.పద్మజ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పది, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడుతూ ఈ 40 రోజులు ప్రత్యేక శ్రద్ధతో చదువుకుని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయ సిబ్బందిని అడగాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై శతశాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలన్నారు.

వైభవంగా సాగిన మరిడిమాంబ జాతర

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో గ్రామ దేవత మరిడిమాంబ జాతర శనివారం రెండో రోజు వైభవంగా సాగింది.అమ్మవారి తీర్థ మహోత్స వాన్ని పురష్కరించుకొని వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యే క పూజలు నిర్వహించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.అలాగే తీర్థ మహోత్స వాన్ని పురష్కరించుకొని తీర్థం నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం, పౌరాణిక నాటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఏపీటీఎఫ్ సారథుల ఎన్నిక

బొబ్బిలి: స్థానిక ఎన్‌జీవో హోంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో వివిధ మండలాలకు ఏపీటీఎఫ్ సారథులను ఎన్నుకున్నారు. బొబ్బిలి మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చింతాడ జయ ప్రవీణ్ కుమార్, గొట్టాపు లక్ష్మణరావును ఎన్నుకున్నారు. బాడంగి మండలానికి, రామభద్రపురం మండలానికి, తెర్లాం మండలానికి ఎన్నుకున్నట్టు ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు జేసీ రాజు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బొత్స పద్మావతి, జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు, డోకల రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అభ్యున్నతిపై నిర్లక్ష్యం తగదు

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్


మాట్లాడుతున్న మహేష్

జియ్యమ్మవలస: ఉపాధ్యాయుల అభ్యున్నతి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆందోళన వ్యక్తం చేశారు. చినమేరంగి గ్రామంలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా చందా పెంపుదలకు సంబంధించి పరిణితి చెందిన బాండ్లను సంబంధిత కార్యాల యానికి పంపడానికి నిధి యాప్‌లో ఇంతవరకు చేర్చలేదని, తద్వారా ఉపాధ్యా యులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై వెంటనే ఏపీజీఎల్ఐ తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పరిణితి బాండ్లను సమర్పించి ఆరు నెలలు అవుతున్నా ఇంకా క్లయిమ్ అమౌంట్లను చెల్లించకపోవడం శోచనీయమని, వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ ఆడిట్ కన్వీనర్ ద్వారపురెడ్డి వేణు ఉన్నారు.

నివాస స్థలాల రిజిస్ట్రేషన్‌లో నిబంధనలు తప్పనిసరి

● వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోవిందరావు

గరుగుబిల్లి: ప్రభుత్వం కేటాయించిన నిబంధనల మేరకు నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయించాలని జేసీ రోణంకి గోవిందరావు సూచించారు. మండల తహసీల్దార్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో పంచాయతీలవారీగా మంజూరు చేసిన స్థలాల హద్దులు, తదితర వివరాలను సచివాలయాలకు విధిగా వీఆర్వోలు అందించాలన్నారు. రిజిస్ట్రేషన్ల నిర్వహణపై పలు సూచనలు అందించారు. క్షేత్ర స్థాయిలో సక్రమంగా విధులు నిర్వహించకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ జనార్ధన్, ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, వీఆర్వోలు టి.రవికుమార్, టి.శ్రీనివాసరావు, బాలబాబు, వి.కరుణ, ఆర్.వినాయక్, పి.రామకృష్ణ, ఆర్.రామానుజం పాల్గొన్నారు.

ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ కరపత్రం ఆవిష్కరణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమానికి సంబంధించి ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ కరపత్రాన్ని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, ఏపీవో మురళీధర్ శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాజమండ్రిలో ఫిబ్రవరి 5, 6 తేదీలలో ఆదివాసీ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప, కార్యదర్శి విష్ణునాయక్ తెలిపారు. వీరితో పాటు డీఎస్ఎఫ్ నాయకులు చిన్న, బ్రహ్మం, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అవగాహన సభకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న సీఐడీ ఎస్ఐ సురేష్‌బాబు

సాలూరు: వివిధ ప్రభుత్వ చట్టాలు, వివిధ సెక్షన్లపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన సభ నిర్వహించేందుకు శనివారం సీఐడీ ఎస్ఐ సురేష్‌కుమార్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జయరాంతో పాటు మున్సిపల్ అధికారులు ఉన్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీలకు, ఎస్టీలకు అవగాహన సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

క్వారీ నిర్వహణకు ఇబ్బంది లేదు

● ప్రభుత్వ రాయితీలు వర్తించేలా చూడండి

● అభిప్రాయ సేకరణలో కొనిస గ్రామస్థులు

గజపతినగరం: క్వారీ నిర్వహణకు తమకు ఎటువం టి ఇబ్బందులు లేవని అయితే కార్మికులకు ప్రభుత్వపరంగా వచ్చే రాయితీలు వర్తించేలా చర్యలు తీసుకోవడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిం చాలని కొనిస గ్రామస్థులు అధికారులను కోరారు. శనివారం కొనిస గ్రామంలో సర్వే నెం.178లో 8.466 హెక్టార్లలో కలర్ గ్రానైట్‌కు సంబంధించి 12.002 క్యూబిక్ మీటర్లు తవ్వకాలకు సంబంధించి డీఆర్వో డి.సుదర్శనదొర అధ్యక్షతన గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ చేపట్టారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలు శీరంరెడ్డి రామ్‌కుమార్ మాట్లాడుతూ క్వారీలో పనిచేస్తున్న వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వాహనాల రాక పోకల వల్ల రోడ్లు పాడయ్యే పరిస్థితి ఉందని అందుకు క్వారీ యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విధాలుగా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు యాజమాన్యం తెలిపింది. అనంతరం డీఆర్వో సుదర్శనదొర మాట్లాడుతూ గ్రామస్థుల అభిప్రాయం తీసుకున్నామని దీనిని కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. పొల్యూషన్ ఎన్‌రోల్‌మెంట్ ఇంజినీర్ అధికారి సరిత, డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాల నిరోధానికి సహకరించండి

జియ్యమ్మవలస: పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నిరోధానికి తనకు పూర్తి సహకారాన్ని అందించాలని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు అన్నారు. శనివారం ఆయనను చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసులు పరిచయం చేసుకుని, సన్మానించారు. ఈసందర్భంగా ఆయన. వారి పరిధిలో నిత్యం జరుగుతున్న నేరాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉంటూ ఎటువంటి నేరాలు జరగకుండా జాగ్రత్తగా గమనించాలన్నారు. వెంటనే తమ నోటీసుకు తేవాలన్నారు.

విద్యారంగ సమస్యలపై 30న ధర్నా

గుమ్మలక్ష్మీపురం: గిరిజన విద్యారంగ సమస్యలపై ఈనెల 30న పార్వతీపురం ఐటీడీఏ ఎదుట యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నాయకులు ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమకానికి జిల్లాలోని ఆదివాసీ ఉద్యోగులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని ఆరు గంటల ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

పార్వతీపురం రూరల్: నర్సిపురం శివారు ప్రాంతాల్లో రూరల్ పోలీసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తోంది.

వైసీపీతో విసిగి..

● భారీగా టీడీపీలోకి చేరికలు

● పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు


మెంటాడ: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

విజయనగరం జిల్లాలో వైసీపీకి చెందిన అనేక కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలకు విసుగు చెంది తెలుగుదేశంలోకి చేరామని చెప్పారు. వీరిని పార్టీ నేతలు ఆహ్వానించారు.

సుందరాడలో 300 కుటుంబాలు

తెర్లాం: మండలంలో సుందరాడకు చెందిన సుమారు 300 కుటుంబాలు వైసీపీని వీడి శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీళ్లందరినీ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ సభలో బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గుండాల అప్పన్న, సీనియర్ నాయకులు దాకారపు అర్జునరావు, గాడి మురళీ, గుండిపల్లి సత్యం, నల్లబిల్లి దాసు, సామంతం కృష్ణ, దాకారపు కృష్ణ, కోట సురేష్ తదితరులు ఉన్నారు. అనంతరం బేబీనాయన, తెంటులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసేది ఏమిలేదని, ప్రజలకు ఏమీ చెప్పుకోవాలో తెలియక ప్రజలు, నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని బేబీనాయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్, మాజీ ఎంపీపీ సింహాచలం, టీడీపీ సీనియర్ నాయకులు యుగంధర్, శంకరరావు, గ్రామనాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో నాయకులకు పూలతూ ఘనస్వాగతం పలికారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబీనాయన, తెంటు

రిజర్వాయర్ పనులు గాలికొదిలేశారు

మెంటాడ: మండల పరిధిలో ఉన్న గుర్ల మినీ రిజర్వాయర్‌ను టీడీపీ హయాంలో ప్రారంభించి, 70శాతం పనులు పూర్తి చేశారని, అయితే వైసీపీ ప్రభుత్వం దీనిని గాలికి వదిలేసిందని, వచ్చే టీడీపీ ప్రభుత్వంలో దీనిని పూర్తి చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని గుర్ల గ్రామంలో శనివారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన 50 కుటుంబాలను ఆమె కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుత మంత్రిగా ఉన్న రాజన్నదొరకు ఈ రిజర్వాయర్ సంగతి పట్టకపోవడం ఈ ప్రాంతవాసుల దౌర్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఆదినారాయణ, రెడ్డి పార్వతి, సరకాన రామునాయుడు, చిన్నంనాయుడు, వెంకన్న, తిరుపతి, గోవింద్, డీలర్ సత్యం పాల్గొన్నారు.


పూసపాటిరేగ: పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న బంగార్రాజు, పతివాడ

పసుపాం పంచాయతీలో 150 కుటుంబాలు

పూసపాటిరేగ: పసుపాం పంచాయతీలో సుమారుగా 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ కంది వెంకటరమణతో పాటు పంచాయతీ సభ్యులు ఐదుగురు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు. వీరిని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు తదితరులు ఆహ్వానించారు. ఈసందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ వైసీపీతో విసిగిపోయిన ప్రజలు టీడీపీ విధానాలకు ఆకర్షితులై భవిష్యత్తులో పెద్దఎత్తున చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, అప్పలనారాయణ, పార్టీ నాయకులు పిన్నింటి సన్యాశినాయుడు, ఇజ్జురోతు ఈశ్వరరావు, ఆకిరి ప్రసాదరావు, దంగా భూలోక, తదితరులు పాల్గొన్నారు.

బడారిపేటలో 25 కుటుంబాలు

గుర్ల: బడారిపేట గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు కిమిడి నాగార్జున సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సన్యాసినాయుడు, మహేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నాగార్జున సమక్షంలో పార్టీలో చేరుతున్న దృశ్యం

వైసీపీ బీసీ వ్యతిరేక ప్రభుత్వం

● మాజీ మంత్రి శత్రుచర్ల


మాట్లాడుతున్న మాజీ మంత్రి శత్రుచర్ల

గుమ్మలక్ష్మీపురం: వైసీపీ బీసీ వ్యతిరేక ప్రభుత్వమని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు విమర్శించారు. శనివారం గుమ్మలక్ష్మీ పురంలో టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక ప్రభుత్వమే అన్నారు. ఎస్సీ, బీసీలపై వేధింపులు పెరిగాయన్నారు. టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ కలిసి ఈ ప్రజా వ్యతిరేక విధానాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొంకాడ రామకృష్ణ, పాడి సుదర్శనరావు, వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం

● పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర


మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ ప్రభుత్వ కాలంలోనే బీసీలకు అన్నింటా న్యాయం జరిగిందని పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద జయహో బీసీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయచం ద్ర మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ఆదరణ పథకంతో కుల వృత్తుల వారికి అండదండగా చంద్రబాబు నాయుడు ఉండేవారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్నింటా అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, అరకు పార్లమెంట్ టీడీపీ బీసీ విభాగం ప్రతినిధి రవి, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, జి.రవికుమార్, మజ్జి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు కొండలరావు

పాచిపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో నిలదీసి అడిగినవారు కరువయ్యారు. కొంతమంది సభ్యులు సీఎం జగన్మోహన్‌రెడ్డి సభకు జనాలను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమావేశంలో పాచిపెంట ఎంపీటీసీ సభ్యుడు దండి కొండలరావు మాట్లాడుతూ ఇంటింటి కొళాయిలు ఇస్తామని చెప్పి సంవత్సరం గడుస్తున్నా ఈ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించడం లేదన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామాంజ నేయులు మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కేరంగి పంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయని, వైర్లు బాగా కిందకు వేలాడుతున్నాయని కేరంగి సర్పంచ్ ప్రతినిధి తెలిపారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

పనిభారం తగ్గించండి


ఎంపీడీవో పైడితల్లికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ కార్యదర్శులు

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని కోరుతూ వారు శనివారం స్థానిక ఎంపీడీవో జి.పైడితల్లికి వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులను డీడీవోలుగా నియమించారని, దీంతో తమపై పనిఒత్తిడి పెరిగిందన్నారు. పలు శాఖల సిబ్బంది ఉన్నతాధికారుల సిఫారసులో సర్వేల్లో పాల్గొనడం లేదని ఆరోపించారు. సర్వేలకు గైర్హాజరవుతున్నారని, పూర్తిస్థాయిలో సహకరించడం లేదని, దీంతో తమపై పనిభారం పడుతుందని తెలిపారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ సంబంధించి సమాచారాన్ని ఆయా శాఖల అధికారులకు నివేదిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు సీహెచ్‌వీ కూర్మినాయుడు, తిరుపతి భాస్కరరావు, అప్పారావు, భార్గవ్‌నాయుడు, లలిత, డి.జగదీశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జలజీవన్ పనులపై విచారణ చేపట్టాలి

సీతంపేట: మండలంలో జలజీవన మిషన్ పనుల్లో నాణ్యత లోపిస్తోందని.. వీటిపై వెంటనే విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. నాలుగేళ్ల కిందట రూ.ఏడు కోట్లతో ప్రారంభమైన ఇంటింటా మంచినీటి కొళాయి ప్రాజెక్టు నేటికీ ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికలు సమీపించడంతో కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టి సారించాలన్నారు.

పనుల వేగవంతానికి చర్యలు


మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ శ్రీహరి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో పనులు వేగవంతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీతంపేట క్లస్టర్ ఉపాధి ఏపీడీ గుంట్రెడ్డి శ్రీహరి తెలిపారు. శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి పనులు నిర్వహణపై లక్ష్యాలు విధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గరుగుబిల్లి, వీరఘట్టాం, పాలకొండ, భామిని, సీతంపేట మండలాల్లో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.70లక్షల పనిదినాలు కల్పించనున్నట్లు తెలిపారు. సంబంధిత ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లకు లక్ష్యాలను విధించారు. క్షేత్రస్థాయిలో వేతనదారుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే 8 నెలలకు సంబంధించి రూ.158 కోట్లు ప్రతిపాదనలు చేశామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వేతనదారులకు 15 రోజుల్లో పనులు కల్పించకుంటే నిరుద్యోగ భృతి అందించాల్సి ఉందని స్పష్టం చేశారు. సంబంధిత ఉపాధి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నిబంధనలు ధిక్కరించే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ ఎ.గోపాలకృష్ణ పట్నాయక్, సిబ్బంది మరిశర్ల హరికృష్ణ, టి.తిరుపతిరావు, భద్ర, తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించాలి


చిరు పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు సూచించారు. తోటపల్లిలో పలు పంటలను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చిరు పంటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లాకు సంబంధించి 15 మండలాల్లో ఏటీఎం నమూనాలతో పంటలు సాగు చేస్తున్నారన్నారు. నిరంతర ఆదాయం వచ్చే వాటిపై దృష్టి సారించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయనిక ఎరువులు వినియోగించకుండా రైతులకు అందుబాటులో ఉండే వాటిని ఉపయోగించాలన్నారు. ఈ పరిశీలనలో డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, జి.శ్రీనివాస్, డి.వెంకటనాయుడు, ఎన్.ప్రసాద్, కె.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌లో ముగడ యువతి


రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొన్న గౌరీశ్వరి

బాడంగి: గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాహస విన్యాసాల్లో రెండుసార్లు పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది ముగడ గ్రామానికి చెదిన తెంటు గౌరీశ్వరి. కేరళలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ (సిటీ)గా విధులు నిర్వహిస్తున్న గౌరీశ్వరి న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్ మహిళల మార్చ్‌లో పాల్గొంది. గత ఏడాది రిపబ్లిక్‌డే వేడుకల్లో మార్చ్‌పాస్ట్ నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ బృందంలోనూ ఆమె ఉన్నారు.

కురుపాంలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తా

● పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరేష్, ప్రదీప్ చంద్రదేవ్

కురుపాం: కురుపాం నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపునకు శాయశక్తుల కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అన్నారు. టీడీపీ యువగళం ప్రారంభించి సంవత్సరం అయిన సందర్భంగా శనివారం కురుపాం కోటలో మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్‌తో పాటు ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చి, నియోజకవర్గం అభివృద్ధి భారం పెట్టారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని బీసీల పార్టీ అయినటు వంటి టీడీపీకి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు 16రకాల స్కీములను ఎత్తివేసిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల సమస్యలు తీరుతాయన్నా రు. అనంతరం జయహో బీసీ కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కురుపాం మండలంలో జరుగుతున్నటు వంటి జయ హో బీసీ కార్యక్రమాన్ని బీసీలు, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పూరీ శ్రీక్షేత్రానికి భక్తుల విరాళాలు


వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

రాయగడ: శ్రీక్షేత్రం జగన్నాథ మందిర పరిక్రమ ప్రకల్ప్ ప్రాజెక్టు ద్వారా ఇటీవల జిల్లా నలుమూలల పర్యటించిన రథం.. భక్తుల నుంచి వివిధ రూపంలో కానుకలు స్వీకరించింది. భక్తుల నుంచి సేకరించిన 232 క్వింటాళ్ల బియ్యం, 350 కొబ్బరికాయలు, 56 కేజీల వక్కలను ఓ ప్రత్యేక లారీలో పూరీ పంపించారు. నగదు రూపంలో భక్తులు అందించిన విరాళం రూ.4లక్షల 13వేల 835లను

ఒడిశా

జగన్నాథుని బ్యాంకు ఖాతాలో జమచేశారు. కానుకలతో బయలుదేరిన ప్రత్యేక వాహనానికి పూజలు నిర్వహించిన అనంతరం, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రొయత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగన్నాథ సరక ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయమాఝి, జడ్పీ అధ్యక్షురాలు సర్వస్వతి మాఝి, స్థానిక ఎమ్మెల్యే మకరంద ముదిలి పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ క్లబ్ సంస్థాపన దినోత్సవం


మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక యూజీఎంఐటీ పాలిటెక్నిక్ కళాశాల సమావేశ హాలులో జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.మురళీమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. అనంతరం వివిధ విభాగాల కొత్త కమిటీలను ఎంపిక చేశారు.

ఈపీఎఫ్ పింఛన్‌ను రూ.9వేలకు పెంచాలి

నెల్లిమర్ల: ఈపీఎఫ్ కనీస పింఛనును 9వేలకు పెంచాలని వామపక్ష సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జరజాపుపేటలోని మహాత్మాగాంధీ విగ్రహానికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ నాయకుడు మొయిద పాపారావు, సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు, ఇఫ్టూ నాయకులు ఉరిటి సింహాచలం, కాళ్ల అప్పలసూరి, గాడు కృష్ణ, మద్దిల రాము తదితరులు ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 70 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని.. బీజేపీ ప్రభుత్వం వీరికి పింఛనును పదేళ్ల కాలంగా పెంచకపోవడం దారుణమని అన్నారు.


గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం